314089001

పది దినములనుండి పస్తుండు వానికి
మంచి భోజనము లభించినట్లు
చెరువు బావుల నీళ్లు కరవైనప్పుడు
వరుసగా వర్షంబు కురిసినట్లు
సంతతి లేకను చింతిల్లు వానికి
పుణ్యాసుపుత్రుండు పుట్టినట్లు
కూటికి లేకను అల్లాడుచున్నట్టి
పేదకు భక్ష్యంబు దొరికినట్లు
ధర్మనాశనమగుచున్న ధరణియందు
ప్రభవమందెను దైవము సజ్జనుల బ్రోవ
ఇంతకన్నను వేరెద్ది ఎఱుక పఱతు
సాధుసద్గుణ గణ్యులౌ సభ్యులార.!

సహస్ర శీర్షా పురుషః సహస్రాక్ష సహస్రపాత్' వేలాది శిరములు, వేలాది నేత్రములు, వేలాది పాదములు ఇవన్నీ కూడను భగవంతుని యొక్క అంగములే. ప్రపంచమంతయు, ప్రతి జీవియు భగవంతుని ప్రతి బింబములే. ఇట్టి పవిత్రమైన దివ్యత్వము తనయందే వున్నదని గుర్తించుకొనలేక మానవుడు ఆ దివ్యత్వమును పొందే నిమిత్తమై అనేక విధముల ప్రయత్నములు సలుపుతున్నాడు. పెరటిలో నున్న కల్పవృక్షమును గుర్తించలేక పాలకై పొరుగింటికి పరుగెత్తే వాని వలె తనయందున్న దివ్యత్వమును మరచి కేవలము దైవము కోసమై బాహ్యప్రపంచమందు వెతుకుటకు ప్రయత్నిస్తున్నాడు మానవుడు.

ఇంటియందున నగ్ని వెలుగుచు నుండగా
పొరుగింటి కగ్నికై నరుగ నేల ?

మానవత్వములో వుండిన బలహీనత యిది యే.

అవతారములు రెండు విధములుగా వుంటున్నవి. ఒకటి అంశావతారము. రెండవది పూర్ణావతారము. సమస్త జీవులూ అంశావతారములే. 'మమైవాంశో జీవభూత జీవలోకే సనాతనః'' నా అంశమే సర్వభూతములందు వున్నదని దాను హెచ్చరిస్తూ వచ్చాడు. ఐతే యీ అంశావతారములు మాయకు బద్ధులై

మమత్వమును, అహం తత్వమును అభివృద్ధి పరచుకొని జీవ తత్వముతో యీ జగత్తునందు జీవిస్తున్నారు. పూర్ణావతారములు మాయను వశపరచుకొని మాయకు అతీతమై తనయొక్క దివ్యత్వమును ప్రపంచమునకు ప్రకటింప జేసే నిమిత్తము దివ్యత్వముతోనే జీవిస్తూ వుంటుంది. సమయ స్ఫూర్తి మాయకు బద్ధుడైనట్లుగా తాను నటించి మాయకు ఏమాత్రము సంబంధము లేని దివ్యత్వముతో తాను జగత్తును పాలిస్తూ వుంటాడు. రామావతారము మాయకు లోబడినట్లుగా నటించి యీ జగత్కళ్యాణ నిమిత్తమై ధర్మమును తాను ఆచరించి అనుభవించి జగత్తుకు అందిస్తూ వచ్చాడు. కృష్ణావతారము అట్లు కాదు. మాయను తన అధీనము నందు వుంచుకొని కేవలము లీలావతారముగా ప్రకటిస్తూ వచ్చాడు. అందుకే వ్యాసుడు అనేక పర్యాయములు భాగవతమునందు 'లీలామానుష విగ్రహ' అని హెచ్చరిస్తూ వచ్చాడు. భాగవత మంతయు కృష్ణుని గుణగణములను ప్రచురిస్తూ తన యొక్క లీలా మహత్తరమైన తత్వము జగత్తుకు ప్రబోధిస్తూ ఆనందపరుస్తూ వచ్చినది. కనుక కృష్ణావతారమందు తనయొక్క తత్వమును ఆచరణయందే కాక ప్రబోధలయందు ప్రచారములందు కూడను తనయొక్క దివ్యత్వమును ప్రపంచమునకు అందిస్తూ వచ్చాడు.

తాను గుణాతీతుడు. కాని లోకోద్ధార నిమిత్తమై తాను గుణములు కలిగినవాడుగా నటించి తాను ఆచరించి జగత్తును ఆనందపరుస్తూ వచ్చాడు. ఏది చేసినా జగత్తుకు మంచి కోసం చేస్తూ వచ్చాడని 'సంజయ [illegible]వాని' చెప్పాడు. ఇది ప్రపంచము యొక్క మంచి నిమిత్తమై తాను ఏది చేసినప్పటికిని, ఏది చెప్పినప్పటికిని తన కోసం కాదు. జగత్తు కోసం. ఇట్టి పరమ సత్యమును ప్రపంచము గుర్తించుకొనలేక తమలో బాలు భగవంతుని యొక్క గుణగణములను కొన్నిరకములైన కళంకములను చేకూరుస్తూ వచ్చారు. 'యద్భావం తద్భవతి' మానవుని యొక్క భావములను పురస్కరించుకొని యే దివ్యత్వాన్ని కూడను తాము ఆరీతిగా సంగ్రహిస్తూ వస్తుంటారు.

(2) ప్రేమ అమృత మయము. మధురాతి మధురము. ఇట్టి భక్తి రస ప్రభావమును గ్రోలినవార గోపికలు. కాని అట్టి గోపికలు ఏ ముక్తిని గాని, ఏ జ్ఞానమును గాని, ఏ వైరాగ్యమును గాని వారు ఆశించలేదు. భక్తికి మించిన దైవత్వములో వుండిన ఆనందము మరొక దానియందు కానరాకపోయినది గోపికలకు. దీనినే నారదుడు పరమ భక్తి అని ఒక నూతన పేరును అందించాడు. ఇట్టి పరమ భక్తి స్వరూపులైన ఆనాటి భక్తులు పరమాత్ముని సన్నిహితునిగా, పెన్నిధిగా భావించి అనుభవిస్తూ వచ్చారు. ఇట్టి భగవత్ప్రేమను గ్రోలిన గోపికలు మత్తులై ఉన్మత్తులై, ప్రేమోన్మత్తులై పిచ్చివారివలె తిరుగుతూ వచ్చారు. భవనములు వదిలి వనములలో ప్రవేశిస్తూ వచ్చారు. కృష్ణుని మురళీగానమును విన్నంత మాత్రమునే వారు మైమరుస్తూ వచ్చారు. భగవంతుడు శబ్దబ్రహ్మస్వరూపుడని గుర్తిస్తూ వచ్చారు. జగత్తునందు కలిగిన సమస్త పదార్థములు కూడను వారు విస్మరిస్తూ వచ్చారు.

జ్ఞానమనగా కేవలము గ్రంథపరిచయము కాదని జ్ఞానమనగా అనేక విషయములను సంస్మరింప జేసి పరిశోధించి అందుగల వస్తువు కాదనియు, యివన్నియు కేవలము పదార్థప్రజ్ఞానమే తప్ప పరార్థ ప్రజ్ఞానము కాదనియు జ్ఞానమనగా ఏకాత్మ భావమే నని వారు విశ్వసిస్తూ వచ్చారు. మాకు సర్వము కృష్ణుడే. మా పెన్నిధి మా సన్నిధి మా మిత్రుడు సర్వము మా కృష్ణుడే. ఇహము పరము కూడను మా కృష్ణుడే. ఇట్టి ఏకాత్మ భావమును వారు అనుభవిస్తూ వచ్చారు. కృష్ణ వియోగము సహించలేక పోతూ వచ్చారు. జడ చైతన్యములనే భావము గోపికలు విస్మరిస్తూ వచ్చారు. రెండింటిని సమత్వముగా భావిస్తూ వచ్చారు. ఇదే స్థితప్రజ్ఞ లక్షణముగా గోపికలు అనుభవిస్తూ వచ్చారు.

ఇవి వృక్షములే యివి మాటలాడ గలవా? అనే విచారణ వారికి లేకపోయింది. యివి పొదలే వీటికి నోరు కలదా అనికూడను వారు విచారము చేయలేదు. ఇవి పుష్పములే యివి మాకు జవాబు చెప్పగలవా అని కూడను వారికి జ్ఞానము లేకపోయింది. 'విశ్వం విష్ణు స్వరూపం' సర్వము కూడను భగవంతుని స్వరూపకముగా భావిస్తూ వచ్చారు గోపికలు. ఎక్కడికి పోయినప్పటికిని కృష్ణుడెక్కడు? కృష్ణుడెక్కడ? ఈ భావము తప్ప అన్య భావములు వారి హృదయములలో కదలలేదు. దీనికి భాగవతమునందు చక్కని ఆదర్శము చూపిస్తూ వచ్చాడు పోతన. గోపికలు కృష్ణుని కానలేక అనేక విధములు పరితాపము చేత పరుగు తెత్తు కాచి పోతున్నారు. బృందావనములో ప్రవేశించారు.

నల్లనివాడు పద్మనయనంబుల వాడు కృపారసంబుపై
జల్లెడు వాడు మౌళి పరిసర్పిత పింఛము వాడు నవ్వురా
జిల్లెడు మోము వాడొకడు చెల్వలమాన ధనంబు దోచెనో
మల్లియలార మీపొదల మాటున లేడు గదమ్మ చెప్పరే.

చూచారా సర్వకాల సర్వావస్థలందు కృష్ణ చింతయందే వారి హృదయము అర్పితము గావించుకున్న గోపికలకు కృష్ణుని యొక్క రూపరేఖలు తప్ప, కృష్ణుని మధురమైన ప్రేమ తప్ప అన్యము వారు యేమాత్రము ఆశించలేదు. అన్వేషించలేదు.

ఇట్టి మధురామృతమును ఆరగించిన చిత్తములు మరొక పదార్థమును హృదయానికి హత్తుకొనివ్వరు. అదే భాగవతమునందు

మందార మకరంద మాధుర్యమున దేలు
మధుపంబు వోవునే మదనములకు

పరిమళమైన మందార పుష్పము యొక్క మకరందమును గ్రోలిన తుమ్మెద ఉమ్మెత్త పూవులవైపు వెరుకుతుందా? ఆకాశామృతమును గ్రోలు యీ పక్షులు కేవలము ఒకవిధమైన మురికి కాలువలలో ప్రవేశించునా. మధుర

పైన మామిడి చిగురును, పూవులను ఆరగించెడి కోకిలలు అడవి మల్లెల ఆశించునా? చల్లని వెల్లని చంద్ర కాంతిని గ్రోలి ఆనందముగా ఆడుకునే చకోరపక్షులు కేవలము మంచు పువ్వులపై మనసు పోవునా? అటులనే నిత్యసత్యమైన భక్తి ప్రపత్తులు కలిగిన మానవుని యొక్క మనస్సు దైవ పాదపద్మముల పైన తప్ప అన్యప్రదేశములను యేమాత్రము అది పొందదు. ఇట్టి పవిత్రమైన చిత్తములు కలిగిన వ్యక్తులే గోపికలు. ద్రేపల్లెలో పుట్టిన గోపికలు, కృష్ణుని ఆనందామృతమును గ్రోలిన గోపికలు, కృష్ణుని అనురాగమునకు పాత్రులైన గోపికలు కృష్ణుని అత్మాన్వేషణను అనుసరించిన గోపికలు అన్యమును యేమాత్రము కూడను ఆశించలేదు. కనుక ఏ క్షణ క్షణము కూడను గోపికల యిండ్లకే పరుగెత్తేవాడు కృష్ణుడు. తల్లి ఎన్నివిధములుగా ప్రయత్నించినప్పటికీని ఇంటిలో ఒక క్షణమైనా వుండేవాడు కాదు కృష్ణుడు. ద్రేపల్లెనుండి ఎన్నివిధములైన కంప్లైంట్లు వచ్చినప్పటికి ద్రేపల్లె వదిలేవాడు కాదు కృష్ణుడు. ఆ ద్రేపల్లె పూర్తి కూడను గోపికల యొక్క ప్రేమామృతము నిండి వుండేది. ప్రతి గోపిక యింటినుండి అపహరించే వెన్న కాదది. గోపికల యొక్క హృదయాలే. బుట్టలు అనగా పవిత్రమైనది, నిర్మలమైనది, సున్నితమైనది. ఇలాంటి హృదయము గోపికల యొక్క హృదయము. గోపికల హృదయాన్ని వ్యాసుడు వెన్నతో పోల్చుకున్నాడు. ఒకనాడు గోపికలందరు కంప్లైంటు చేస్తే యశోద చెప్పుతున్నది కృష్ణునకు

పెట్టినవి తినవు గొల్లల
పట్టులకుం బోయి వెన్న పట్టెదుటగ లో
గుట్టున తినెదవు నీతో
పుట్టెను రట్టుళ్ళు కృష్ణ పాపన్ని కుమారా!
కట్టెద రోటికి నిన్ను మానుము నీ చేష్టలింక
మరువము కృష్ణా!
నోరంతయు వెన్న వాసన
గోరంతయు లేవు బాల
ఊరంతయు ఆగడంబు ఒకటే రద్దులు

అనగా తల్లికి కూడను అర్థముగాని దివ్యత్వమును గోపికలకు చూపుతూ వచ్చాడు కృష్ణుడు. ఇట్టి పవిత్రమైన దివ్యత్వమును చిన్న చిన్న విషయములందు కూడను ప్రవేశపెట్టి కృష్ణుడు ద్వాపరయుగమందు దివ్యత్వమును జగత్తుకు ప్రబోధిస్తూ వచ్చాడు.

3 త్రేతాయుగమునందు సత్యధర్మ స్వరూపుడై రాముడు అవతరించాడు. ద్వాపరయుగమందు శాంతి ప్రేమ స్వరూపుడై అవతరించాడు. నేడు సత్యధర్మ శాంతి ప్రేమ స్వరూపాన్ని నాల్గింటిని సమ్మిళితము గావిం

చుకొని అవతరించటం. ఈ ప్రేమ తత్త్వమును ప్రపంచము అంతయు సులభముగా అర్థము చేసుకోలేదు. సంసారమునకూ జగత్తునకు వుండిన సంబంధ బాంధవ్యముగాని బోధముగాని ఎంతవరకు వున్నదనే సత్యాన్ని భాగవతము చక్కగా నిరూపిస్తూ వచ్చింది. సంసారము ధనము కోసము లౌకికమైన సుఖముల కోసము భోగ భాగ్యముల కోసము ఆస్తి పాస్తుల కోసము ఆరాటపడుతూ వచ్చింది. ప్రకృతి సర్వమును అందిస్తూ వచ్చింది. పీల్చుకొనుటకు గాలి, వుండుటకు భూమి, త్రాగుటకు నీరు, తినుటకు అన్నము ప్రాకృతమైన సహజ ధర్మములను మానవుడు యీనాడు విస్మరిస్తూ వస్తున్నాడు. కృత్రిమమైన సుఖసంతోషములకై మానవుడు అర్రులు చాచుచున్నాడు. ఇదియే పరీక్షిత్తుకు శుకుడు బోధించిన ప్రబోధ.

ఈ ప్రకృతి నిరంతరము అహంకార మమకారముల చేతను ఆడంబరముల చేతను, కామక్రోధముల చేతను నిండివుంటున్నది. కనుకనే మానవత్వమనేది యీ ప్రకృతి ద్వారా కొంత పేరు పరచి దివ్యత్వములో ప్రవేశింప జేసినప్పుడే యీ శాంతి సహన ప్రేమ తత్త్వములు మనకు అలవడతాయి. ప్రేమను ప్రేమ ద్వారానే పొందుటకు వీలౌతుంది గాని అన్యమార్గముల చేతయిది అలవికాదు. కనుకనే దివ్యత్వమును పొందగోరిన మానవులు పరమ పవిత్రమైన ప్రేమను మనము అభివృద్ధి పరచుకోవాలి. ఈ ప్రేమ ఒక దైవస్వరూపము. ఇది ఫలరహితమును అనుభవించేది. ఫలాపేక్ష దీనికి లేదు. ఒక్కటే ఫలము. దైవము. దైవము. దైవము. దైవాపేక్ష తప్ప దీనికి అన్య అపేక్ష లేదు. ఇటువంటి జీవితమును యీనాడు మానవుడు అనుభవించుటకు సాధ్యమవుతుందా? 'ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే' ధర్మాన్ని రక్షించే నిమిత్తమై భగవంతుడు అవతరిస్తున్నాడు. ప్రతి మానవుడు ధర్మాన్ని ఆచరించే నిమిత్తమే అవతరిస్తున్నాడు. దేహము ధర్మ నిమిత్తమై వచ్చినదే. శరీరమాద్యం ఖలు ధర్మసాధనం' ధర్మసాధన నిమిత్తమై శరీరము వచ్చింది. ఐతే యిక్కడనే మనము చక్కగా విచారించవలసింది. ధర్మరక్షణ కంటె పూర్వము దేహరక్షణ అత్యవసరము. దేహరక్షణ గావించుకున్నప్పుడే యీ దేహము ద్వారా ధర్మ రక్షణ సలుప వచ్చును. కనుకనే దేహరక్షణ ప్రతి మానవునకు అత్యవసరము. దీనిని పురస్కరించుకొనియే health is wealth అన్నారు. ఐతే దేహరక్షణ దేనికోసం. లౌకికమైన భోగభాగ్యములు సంపాదించుకొనుటకే నిమిత్తమై కాదు. ధర్మాన్ని రక్షించే కోసం కాదు. ఏమిటి ధర్మము. మనస్సునందు ఆవిర్భవించిన అభీష్టమును వాక్కునందు ప్రవచింప జేసి, వాక్కునందు ప్రవచింప చేసిన ధర్మమును క్రియారూపములో మనము ప్రపంచమునకు నిరూపించాలి. మనస్సు మాట క్రియయు మనిషికొకటైన అదియే నిజమైన మానవత్వము. మనస్సునందు వేరు, మాటయు క్రియయు వేరువేరైన విలువ ఏమి? ఈనాటి మానవత్వమందు యీ త్రిపుటి సిద్ధి మనకు లభించాలి. ధర్మము యేనాటికి నశించునది కాదు. ధర్మాచరణ మాత్రమే క్షీణిస్తూ వస్తుంది. కనుక యీనాడు మనము ధర్మమును ఆచరించుటకు తగిన కృషి చేయాలి. అదియే నిజమైన సాధన. ఈ సాధన అనగా వేదో జపము ధ్యానము యోగము యివన్నీ కేవలము కాలమును సార్థకము గావించుకొనే నిమిత్తము ఏర్పడినవే. జన్మ సార్థకత కోసము యీ

త్రికరణ శుద్ధి అవసరము.

ప్రేమ స్వరూపులారా! కృష్ణ జనన మనగా కేవలము ఎప్పుడో ద్వాపరయుగములో పుట్టెడని, ఎప్పుడో దీనికి తగిన ప్రబోధలు సల్పెడని మనము భావించరాదు. క్షణక్షణము ప్రతి ఒక్కరి హృదయ మందు ఆ కృష్ణ భావమును నిరంతరము పోషిస్తూ రావాలి. కృష్ణ అనగా ఏమిటి? ఎప్పుడు పుట్టాడు. ఆపుట్టిన కాలమును మనము చక్కగా విచారణ చేస్తే దీనికి సరియైన స్థానము అందుకోవచ్చు. శ్రావణమాసము. కృష్ణ పక్షము. అష్టమి తిథి. చీకటి యింటిలో నల్లగా వుండే కృష్ణుడు పుట్టాడు. శ్రావణమనగా శ్రవణమునకు ఆనందము నందించునది. కనుకనే సాధనల యందు మొట్టమొదట శ్రవణమును హెచ్చరిస్తూ వచ్చారు. భగవంతుని పొందటానికి నవవిధ భక్తుల లో శ్రవణము మొదటిది.

శ్రవణం కీర్తనం విష్ణోః స్మరణం పాదసేవనం

అర్చనం వందనం దాస్యం సఖ్యమాత్మ నివేదనం.

ఈ నవవిధ మార్గములందు కట్టకడపటిది ఆత్మనివేదన. మొట్టమొదటిది శ్రవణము. శ్రవణము చేతనే ఆత్మనివేదనకు అర్హులమవుతాము. కాని దురదృష్టవశాత్తు మనము లోకసంబంధమైన అశుభమైన అశాంతిని కలిగించేటువంటి శ్రవణము చేస్తున్నాముగాని సత్యమైన నిత్యమైన మధురమైన అమృతమైన అమరత్వమైన విషయము శ్రవణము చేయటానికి మనయొక్క కర్ణము యేమాత్రము సంసిద్ధముగా లేదు. శ్రవణమనగా లోకసంబంధమైన విషయాల్ని వినటం కాదు. దివ్యత్వమునకు సంబంధించిన శ్రవణమే శ్రవణము. కనుకనే ఒక భక్తుడు చెవులకు చెప్పాడు.

పొద్దుపోక పరివారిసుద్దులంటే

సిద్ధమౌదురే కడు శ్రద్ధ తోడ

మంద్దుముద్దుగాను

భగవత్ ముచ్చట చెప్పవేళ

ఒద్దిక నుండరె చెవులా

ఈ కలియుగ ప్రభావము చేత యితరులయొక్క తప్పొప్పుల విషయాలు గురించే మనము శ్రవణము చేస్తున్నాముగాని పవిత్రమైన దివ్య నామమును మనము శ్రవణము చేయటానికి తగిన కృషి చేయటం లేదు. మనకు కన్నులను ఎందుకోసం యిచ్చాడు.

కన్నుల నిచ్చిన దెందుకో తెలుసా

అన్నియు చూచేటందులకా? కాదు కాదు

దేవాది దేవుడౌ

కైలాస వాసుని చూచేటందుకురా!
పొందుగ పాదము లిచ్చినదెందుకు
సందులు గొందులు తిరుగుటకా
అందుకు కాదు నందివాహనుని
మందిరమునకేగెందుకురా!

ఈ విధముగా మానవుని సర్వాంగములు కూడను దైవారాధన యందే అంకితము గావించే నిమిత్తమై అందించినది.

ధర్మ సంస్థాపన అనగా ఏమిటి? మన అంగములు ఏ ఏ కార్యముల నిమిత్తమై యేర్పడినవో ఆయా కార్యములందు వాటిని ప్రవేశపెట్టుటయే ధర్మము. మంచిని చూడు. మంచిని మాటాడు. మంచిని విను మంచిని తలంచు. మంచి ప్రదేశమునకు పో. మంచి పనులు చేయి. మంచి మంచి అంటే దేనిని మనము మంచి అని నిర్ణయించగలము. ఎవరో యిది మంచి చేయమంటే అది కాదు మన మంచి.

దేవుడనగ వేరు దేశమందున లేడు
దేవుడుండు తనదు దేహమందె
పాపమనగ వేరు పరదేశమున లేదు
తనదు చేయు పనుల దగిలియుండు.

కాబట్టి నీయందే నీ ప్రబోధ అభివృద్ధి కావాలి. అదే conscience దీని ప్రకారము నీవు నడచుకో. దానిని నీవు అనుసరిస్తూ వస్తే అప్పుడే విధమైన దోషములు నీవు ఆచరించటానికి పూనుకోవు. కనుక దేవుడెక్కడ అంటే ఆ God అని మనము ప్రశ్న వేసుకుంటే లోపలనుంచి అంతర్వాణిగా వస్తుంది.

అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహమాశ్రితః
ప్రాణాపాన సమాయుక్తః పచామ్యన్నం చతుర్విధమ్.

అని చెప్పింది. ఈ విచిత్ర మనిషి నేను నీయందే వుంటున్నాను. నీవు తినే ఆహారమునంతా నేను జీర్ణింప చేస్తున్నాను. జీర్ణింప జేసి నేను అనుభవించటం లేదు. సర్వాంగములకు పుష్టి చేస్తున్నాను. కనుక మనం భుజించే సమయంలో 'బ్రహ్మార్పణం' అనే భావంతో చేయాలి. 'దేహార్పణం' అనే భావముతో చేయకూడదు. అజ్ఞానమును పటాపంచలు గావించి దివ్యజ్ఞానమును బోధించే నిమిత్తమై శ్రవణము ద్వారా కృష్ణుడు లోకములో అవతరించాడు. కనుకనే మొట్టమొదట శ్రవణం గావించాడు. అర్జునునకు మొట్టమొదట భగవద్గీత శ్రవణం.

అక్కడ కూడను నిమిత్త మాత్రం భవ సవ్యసాచి నిన్ను నిమిత్త మాత్రంగా పెట్టి కాని పవిత్రమైన పదార్థాన్ని అందిస్తున్నాను. దైవము సమస్త బాధలు కూడను, సమస్త ప్రచారములు కూడను ధర్మసంబంధమైనవే. ప్రేమ సంబంధమైనవే. ఇక్కడ హృదయానికి జీవరత్నముగా ప్రబోధిస్తూ వచ్చాడు. గోపికలు కోరారు. కృష్ణా!

నీవు నల్లని వాడవు. నా కాళింది మడుగు మహా మాలిన్యమైంది నీకంటె యింకా నల్లగా వుంటుంది. ఆ కాళింది మడుగు లోపల నీ నీడను చూడాలనుకుంటే నీరు నలుపు, నీవు నలుపు నా చూచే కన్నుల మధ్యలో వున్న గుడ్లు నలుపే. ఈ మూడు నలుపైతే నీ యొక్క రూపాన్ని ఏ రీతిగా దర్శించగలను. నీవు కాళింది మడుగు పరిశుద్ధము చేయమని చెప్పను. యీ స్వీపరు పని నీకెందుకు? నీ రూపు అంతకంటె మార్చుకోనక్కరలేదు. నా కన్నుల యొక్క దృష్టిని నీవు మార్చనక్కరలేదు. ఎందుకనగా నీ సుందర విగ్రహమును చూచిన నేత్రములు నావి. కనుక నా దృష్టిని కూడను నీవు మార్చవద్దు. ఆ కాళింది మడుగునందు కనుపించే ఆకాశము రంగు తెల్లదిగా చేయి. ఆ తెల్లని దానిలో నల్లని రూపము చాలా బాగా కనుపిస్తుంది. నా మానస సరోవరమే కాళింది సరస్సు. అనేక కోరికలనే శిరస్సులు కలిగినదే కాళింది. అది యీ మనస్సులో ప్రవేశించింది. ఇదే మానస సరోవరము. ఆ కోరికల యొక్క మాలిన్యమంతా యిందులో వదలిపెట్టింది. ఆ కాళింది మడుగునందు నీ ప్రతిబింబమును దర్శించలేక పోతున్నాను. కనుక నా మనస్సును నీవు పరిశుద్ధము చేయనక్కరలేదు. ఈ మనసునందు ప్రతిబింబించే నా హృదయాన్ని శుద్ధిం చేయి. చిత్తశుద్ధి అత్యవసరము మానవులకని యిక్కడ ప్రబోధిస్తూ వచ్చారు.

అదే తిరుత్తాండాళ్వారు చెప్పాడు. చిత్తశుద్ధి అత్యవసరము. అప్పుడే నీ పూజ సార్థకమవుతుంది. నా మానస సరోవరము చాలా భయంకరమైన సరోవరము. ఇది పెద్ద సముద్రము వంటిది. కోరికల అలలకు ఏ మాత్రము అంత్యము లేదు. కావలసినన్ని అలలు వస్తున్నాయి. కాని దాని అట్టడుగునే వుంటున్నది నీ రూపము. నీవు ముత్యము వంటి వాడవు కృష్ణా. దేహములో ముఖమునకు ముక్కు చాలా ప్రధానమైనది. ముఖము, కన్నులు ఎంత బాగున్నప్పటికిని ముక్కు మాత్రం సరిలేకపోతే అందమంతా చెడిపోతుంది. కృష్ణుని అందమంతా కూడను

కస్తూరీ తిలకం లలాటఫలకే వక్షఃస్థలే కౌస్తుభం నాసాగ్రే నవమౌక్తికం

అన్నీ వున్నాయి. ఆ ముక్కులో వుండిన ముత్యము నీ అందమునంతా జల్లుతూ వుంటుంది. నీవు ముత్యము వంటి వాడవు. ముత్యము సులభముగా చిక్కేది కాదు. లోతైన సముద్రములో వుంటుందది. లోతైన సముద్రములో మునిగి దానిని తీసుకోవాలంటే ఏ యొక్క మహనీయులకో యిది సాధ్యమవుతుంది కృష్ణా. మాకు ముత్యము వంటి వాడవు లభించావు. ఈ సంసార సాగరములో నిన్ను చూచి మేము ఆనందిస్తున్నాము. నీ వలనే మా ప్రాణములు బ్రతికించుకుంటున్నాము. కనుక నీవు మా హృదయాల్ని వదలిపోవటానికి సాధ్యము కాదు. వదలితివా నిన్ను మరల దక్కించుకోలేము. చిక్కిన దానిని దక్కించుకోటమే మహా అదృష్టము. కనుకనే 'యోగక్షేమం వహామ్యహం' అన్నారు భగవద్గీతలో. యోగమనగా అపురూపమైన దానిని మనము సంపాయించుకోటం, సంపాయించుకున్నదానిని రక్షించుకోటం క్షేమం. నీవు మాకు లభించావు. మాకు దక్కించుకునే శక్తి సామర్థ్యములు అనుగ్రహించమని గోపికలు ప్రార్థిస్తూ వచ్చారు.

(5) దీనినే మీరా కూడ చెప్పింది. సముద్రమునందు అనేక విధములైన కష్టములకోర్చి యీ ముత్యమును

వేసుకున్నాము. మా చేతినుంచి జారిపోకుండా చూచుకోమంది. సంసారమే ఒక సముద్రము. మన ఆశలే అలలు మన భావాలు లోతైన యిది. యిందులో రాగ ద్వేషములనే మొసళ్ళు తిమింగలములు వుంటున్నాయి. దీనిలో తిరిగి సామాన్యమైన మానవులు భరించుకోటం కష్టం. ఒక్క నీనామమే సర్వము రక్షిస్తుంది అన్నది. గోపికల భక్తిని కేవలము ప్రాకృతికమైన వాసనలుగా మనము భావిస్తున్నాము చాలా పొరపాటు. వారి చిత్రములు యిట్టివిషయములందు ప్రవేశించేటువంటివి కాదు. విషయవాసనలు వాటికి అత్యంత దూరము. పరమేశ్వర వాసనే వారికి సన్నిహితము. ఈ విశ్వమునంతా వారు విష్ణు స్వరూపముగా భావించుచున్నారు. కనుక దివ్యత్వమును మనం దర్శించాలనుకుంటే ఎక్కడో ఒక ప్రదేశమునకు పోనక్కరలేదు. మన దృష్టిని అంతర్ముఖము గావించుకున్నప్పుడే అక్కడే మనకు దివ్యానందము ఆవిర్భవిస్తుంది. గోపికలు సగుణ నిర్గుణములను రెండును యేమాత్రము విశ్వసించక సాకారమును మాత్రమే వారు ఆశిస్తూ వచ్చారు. సాకారము లేక నిరాకారము సాధ్యము కాదు. మాకు సాకారమే కావాలె. ఈ సాకారములో మా ఆకారము లీనమై పోవాలి. అదే మాదృష్టిలో నిరాకారము అన్నారు. మా ఆకారమును మేము మరచటమే నిరాకారమవుతుంది. మా ఆకారముపైన లక్ష్యము పెట్టి కాని నిన్ను నిరాకారంగా చూడాలంటే యిది సాధ్యమవుతుందా! కనుక మా ఆకారమును మరచి పోవాలె అదే సరైన నిరాకారము. ధ్యానము వలనగాని, జపము వలనగాని, తపము వలనగాని దైవత్వము లభ్యమవుతుందనుకోటం కేవలం ఒక భ్రాంతి. అప్పటికప్పుడు మాత్రమే శాంతిని చేకూర్చవచ్చును. నిత్యశాంతి, నిత్యానందము మనకు లభ్యము కావాలంటే మనయందున్న దివ్యభావాన్నే మనము అభివృద్ధి పరచుకోవాలి.

ఐతే దానికి సరియైన వాతావరణము అనుకూలము కావాలి. అట్టి దివ్యమైన వాతావరణము ఒక పవిత్రమైన సన్నిధియందు మాత్రమే మనకు చేకూరుతాయి. ఇతరత్రా యిలాంటి అవకాశము మనకు లభ్యం కాదు. అందుకోసమే పూర్వము తపస్సులు అరణ్యమునకు వెళ్ళి ఏకాంతమైన ప్రదేశములో కూర్చుని దివ్యమైన వాతావరణమును వారు అభివృద్ధి పరచుకుంటూ వచ్చారు. గ్రామములందు మనదృష్టి, మనశ్రవణము అపవిత్రము గావించుకుంటున్నామనే ఉద్దేశ్యముతో వారు ఆవిధమైన బలహీనతతో వెళ్ళారు. మనము అడవులకు పోనక్కరలేదు. మన హృదయమునందే నివసించిన దివ్యాత్మ తత్త్వమును మనము గుర్తించాలె. ఈనాడు అడవికి పోటు నేను కూర్చున్నా నీ బుద్ధి ఢిల్లీకి పోయి సంచరించవచ్చు. అది [illegible] ఇది [illegible]. అదే నీ హృదయమని. నీ యొక్క శాంతి నీయందే వున్నదిగాని బయట లేదు. ఇట్టి పవిత్రమైన సన్నిధియందు, వాతావరణమునందు యీ శాంతి అభివృద్ధి చేసుకోవచ్చు. కనుక అవతారముల యొక్క తత్త్వమందు సులభమైన మార్గము, తీయనైన మార్గము మధురమైన అనుభూతులు ఒక కృష్ణావతారమునందు మాత్రమే అధికముగా కనిపిస్తూ వచ్చాయి. అట్లని అన్ని అవతారములు పనికి మాలినవని అనుకోకూడదు. ఆయా సమయ స్ఫూర్తిగా వుంటుంటాయి.

ఒక చిన్న ఉదాహరణ. ఎవరో బజార్లో వచ్చి పోట్లాడుతున్నారు. చిన్న చిన్నగా పోట్లాడుతూనే

ఎప్పటికి పోలీసు వచ్చేదు. ఇంకా కొంచెం పోట్లాటలు అధికమై పోయింది. S.I. వస్తాడు. ఇంకా పోట్లాటలు అధికమై పోయి ఒకరినొకరు చంపుకునే స్థితికి వచ్చింది. ఇన్స్పెక్టర్ జనరల్ వస్తాడు అక్కడికి. మొట్టమొదట పోలీసు రావటము తరువాత S.I. రావటము తరువాత I.G.P. రావటము దీనికంతా కారణం ఏమిటి? అశాంతి అధికమయ్యేకొలది అధికమైన స్థానము వారే అక్కడ ప్రవేశిస్తారు. అప్పుడు ధర్మము ఋషుల సన్నిధిలో క్షీణిస్తూ రావటం వలన దాన్ని ఉద్ధరించి ధరణి, ధర్మపత్ని, ధర్మాన్ని ఈ మూడింటిని ఉద్ధరించే నిమిత్తము రామావతారం వచ్చింది.

కానీ కృష్ణావతారము వచ్చేటప్పటికి రాక్షసత్వము మరింత అధికమైపోయింది. ధర్మపత్ని ధరణి అక్కరలేదని ధర్మాన్ని ఉద్ధరించటానికి వచ్చాడు. ధర్మమును ఉద్ధరించినప్పుడు ధర్మపత్ని, ధరణి ఉద్ధారమవుతుంది. కనుక మాయా మానుష విగ్రహమని రాముని, లీలామానుష విగ్రహుడు కృష్ణుడని రామ చరిత్రయందు కేవలము మాయకు బద్ధుడైనట్లుగా ధర్మపత్ని నిమిత్తమై విలపించినట్లుగా స్త్రీలకోసం విలపించినట్లుగా రామావతారంలో కనిపిస్తూ వచ్చింది. కానీ కృష్ణావతారము అట్లు కాదు. తననిమిత్తమై స్త్రీలంతా విలపించినట్లుగా వుంది. కానీ రామావతారమందు కాలుత్రొక్కించుకొని కయ్యానికి పూనుకున్నాడు. ఇతగా రావణుడు వీరందరు కొన్ని విధములైన దుర్గుణములకు అభివృద్ధి కాగా వారితో తప్పనిసరిగా యుద్ధము చేయవలసివచ్చి రాముడు యుద్ధములో ప్రవేశించాడు. కాని కృష్ణావతారము అట్లుకాదు. కాలు త్రొక్కి కయ్యమునకు వెళ్లాడు. రామావతారము మొదట పని తరువాత నవ్వు. కృష్ణావతారము అట్లుకాదు మొదట నవ్వు తరువాత పని. ఈ విధముగా చూస్తే లీలావతారమునకు మాయావతారమునకు వుండిన వ్యత్యాసము గుర్తించటానికి వీలవుతుంది. కృష్ణుడు ఎల్లప్పుడు ఆనందముగా వుండేవాడు. రుద్రభూమి, యుద్ధభూమి, భద్రభూమి అన్నింటియందు ఆనందముగానే వున్నాడు. లేకపోతే యుద్ధము జరుగుతున్నది. ఒకవైపున 11 లక్షలు మరొకవైపున 40 లక్షలు చేరినారు అక్కడ. ఈ ఇరువురి మధ్యలో నిల్చుకున్నాడు కృష్ణుడు. పాటపాడుతున్నాడు. అదే గీత. గీత అనగా పాట. అప్పుడు పాటపాడటానికి అవకాశము వస్తుందా? ఎప్పుడైనా ఉల్లాసముగా వుండినప్పుడే పాటపాడుకుంటాము. 'బాత్‌రూం' లో వుల్లాసంగా వుంటే పాట పాడుకుంటాం. పాట పాడటానికి ఆనందమే కారణము. అదే విధముగనే యుద్ధభూమిలో కూడను ఆనందమయుడు కనుక అక్కడ కూడను పాటపాడుతూ వచ్చాడు. కనుక happiness is in union with God. దివ్యత్వము ఆనందములోనే వుంటున్నది. అన్నింటికిని ఆనందమే.

6 మీకు తెలుసునా లేదా స్వామియొక్క తత్వము. స్వామీ! కడుపునొప్పి బాగావుంది. భరించుకోలేను. అంటే ఆనందము ఆనందము అంటాను. స్వామి! వారు చనిపోయినారంటే బాగాసంతోషము అంటాను. ఎప్పుడూ సంతోషమే. కనుక సంతోషము ఉన్నతమైన స్వభావము. దీనికి ఏడిస్తే వచ్చే ఫలితము ఏముంది?

ఇవన్నీ కూడను కదలిపోయే మేఘములే. ఒక్కటైనా స్థిరమైన మేఘము లేదిక్కడ. కనుక దీనికి విచారించవలసి
న అవసరము లేదిక్కడ.. కనుక విచారించ కూడదు. ఇదియే అవతారము యొక్క ప్రబోధ. దేనికని మనము
కష్టపడ కూడదు. ఏదైనా బాధ కలిగింది. దీనికి తరువాత సుఖము వుంది. The pleasure is an interval
between two pains. కనుక తరువాత మరి ఆనందము కలుగుతుంది. ఈ విశ్వాసము చేతనే మన జీవితము
సాగిస్తూ రావాలి. కనుక దివ్యమైన ఆనందమునకు క్షణికమైన ఆనందమునకు చాలా వ్యత్యాసము వుంటున్నది.
happiness అనేది permanent కాదు. ఇది కేవలము తలకు సంబంధించినదే. తల అనగా responsibility
only. నీవు service చేసేంతవరకు ఆ responsibility వుండాలి. రిటైరు అయిన తరువాత నీ ఆఫీసు సంగ
తి నీకు అక్కర లేదు. కాని ఆనందమనేది హృదయానికి సంబంధించినది. అది శాశ్వతమైనది. నీకు ఇప్పుడు
కొంచెం ఆకలి వేస్తుందది. చాలా విచారంగా వున్నావు. ఎప్పుడెప్పుడు సాయిబాబా ముగిస్తాడా canteen కి
పోయి టిఫిన్ తిందామా అని అనుకుంటావు. నీవు canteen కు పోయి రెండు చపాతీలు తిన్నావంటే సంతో
షము అంటారు. ఇది happy. ఇప్పుడు happy గా వున్నానంటావు. happy అంటే ఏమిటి? సంతోషము
some తోషం అంతే. కొంచమైన తృప్తి. అల్పతృప్తి. కనుక సంతోషము కోసము మీరు పాకులాడకండి.
శాశ్వతమైన ఆనందము కోసం ప్రాకులాడండి. అశాశ్వతమైన ఆనందము ఒక్క దైవము ద్వారా తప్ప అన్యమార్గము
న మనకు లభించదు. కనుక దివ్యమైన ఆనందాన్ని పొందే నిమిత్తమై, దివ్యమైన ఆనందాన్ని అందించే నిమిత్తమై
అవతారములు రావటం. ఈ కష్టములు, నష్టములు, దుఃఖములు, విచారములు ఇవన్నీ కూడను అల్పమైనవి.
ఇవన్నీ ఒక్క ప్రేమలోనే చేరిపోతాయి. ఒక్క ప్రేమను మీరు పొందినారా సర్వము దుఃఖనివారణ జరుగుతుంది.
దైవానుగ్రహము కోసం మీరు పాటుపడండి. దైవము వేరే ప్రత్యేకముగా వున్నాడని విశ్వసించకండి. దైవము నా
యందే వుంటున్నాడని. ఎక్కడ దైవత్వము వుందో అక్కడ విజయము వుంది.

కనుకనే భగవద్గీతయందు అంత్యశ్లోకము

యత్ర యోగేశ్వరః కృష్ణో యత్ర పార్థో ధనుర్ధరః

తత్ర శ్రీర్విజయో భూతిర్ధ్రువా నీతిర్మతిర్మమ.

ఎవరి హృదయములోపల యోగేశ్వరుడైన కృష్ణుడు వుంటున్నాడో, ఎక్కడ ధైర్యము విశ్వాసము అనే విల్లుపై
సాధకుడు వుంటున్నాడో అక్కడే అన్నిసౌభాగ్యములు, అన్నివిజయములు లభ్యమవుతాయి. కృష్ణ అంటే
అర్థమేమిటో మనం గుర్తించాలి. ఇది మూడు విధములైన అర్థాన్ని ప్రబోధిస్తూ వచ్చింది. కృషతీతి కృష్ణ
అన్నారు. కృషి అనగా వ్యవసాయము. దేనిని వ్యవసాయము చేయటము. మన హృదయమనే క్షేత్రమును
వ్యవసాయము చేస్తున్నాడు. మనలోని మొక్కలనే పాడు భావాల్ని పెరికి పారవేస్తున్నాడు. ప్రేమ జలమనే
నీటిలో పెట్టి మెత్త పరుస్తున్నాడు. సాధన అనే మడకలతో దున్నుతున్నాడు. భగవన్నామ మనేదానిని

కేవిల్ నాటుతున్నాడు. కనుక మన హృదయక్షేత్రాన్ని సేద్యము చేస్తున్నాడు. కృషిభూరి కృష్ణ అని ఇది అర్థము. కర్షతీతి కృష్ణః అని రెండవ అర్థము. కర్ష అనగా ఆకర్షించే వాడు. తన కన్నులతో ఆకర్షిస్తాడు. తన మాటలతో ఆకర్షిస్తాడు. తన మాటలతో ఆకర్షిస్తాడు. తన చేష్టలతో ఆకర్షిస్తాడు. తన చూపులతో ఆకర్షిస్తాడు. అన్ని ఆకర్షణలే కృష్ణునివి. ఈ మాటలతో క్రోధములతో నిండిన హృదయాలను చల్లబరుస్తాడు. హాస్యముగా చేస్తాడు. ఒకానొక సమయములో కృష్ణుడు చిన్నపిల్లవాడుగా వున్నప్పుడు గోపికల యింటికి వెళ్ళి స్తంభము ఎక్కి యింటిలో వున్న పెరుగునంతా తీసుకుంటున్నాడు. కోపంగా వచ్చింది గోపిక. స్తంభము గట్టిగా పట్టుకుంది. యింక ఎట్లా దిగుతావు చూస్తాను యిప్పుడు నీతల్లికి తీసుకొని పోయి చూపిస్తాను. నా కొడుకు తప్పు చెయ్యడని అంటున్నాది. తప్పును చక్కగా ప్రత్యక్షముగా చూపిస్తాను అంది. ఆ కోపంగా వచ్చిన గోపిక యిక్కడ నీవు ఏమి చేస్తున్నావు కృష్ణా! చెబుతాడు మాయింటిలో అవుదూడ పోయింది యిక్కడ వుందేమోనని చూస్తున్నానన్నాడు. ఈ మాట వినేటప్పటికి ఆగోపికకు నవ్వువచ్చేసింది పాపం. అవుదూడ మాయింటి లోపల కుండలో వుంటుందని నవ్వువచ్చి యిట్లా మూసుకుంది. కృష్ణుడు దిగివెళ్ళిపోయాడు. ప్రతియొక్కడిని యందు ఆకర్షణ. ఆకర్షణలో వున్నాడు కృష్ణుడు. ఇంక మూడవది కృష్ తుతి కృష్ణ. కుష్ అనగా కుషి ఉల్లాసముగా వుండటం. కృష్ణుడు నిరంతరము ఉల్లాసముతో వుట్టిపడే వాడు. యీ విచిత్రమైన గుణములు కలిగిన తత్వము కనుక అతనికి గర్గుడు కృష్ణా అని పేరుపెట్టాడు. కాని కృష్ణ అంటే నల్లని. నల్లదాన్ని పట్టుకొని మనము ఆడుతున్నాము గాని దాని యొక్క యదార్థమైన అర్థము మనం విచారించటం లేదు. హాస్యముతో కేవలాన్ని ఆనంద పరచే వాడు.

7 ఒక చిన్న ఉదాహరణ చూడండి. గోపికలందరు వచ్చారు యశోద దగ్గరకు. గొల్ల భామలంతా చల్లనమ్మ బోవు చుండగ చల్ల బానకు సుంక మిమ్మని చిల్లులు పడగొట్టినాడు అడుగవె తల్లీ అడగవె.

మేము జలకమాడు చుండ చీరలన్ని మూటగట్టి
పొన్న చెట్టు పైననుండి ఎంత వేడిన నీయడమ్మా
అడుగవె తల్లీ అడుగవె
అర్థ రాత్రి వేళ మాయింటికి వచ్చి
నిద్రపోవు స్త్రీల జడలెత్తి కట్టివచ్చె
అడుగవే తల్లి అడుగవే.

ఇవన్నీ వింటున్నాడు యశోద దగ్గర కూర్చొని. ఈ జడ్జిమెంటు నీవే చేయమని అడిగాడు యశోదను.

అమ్మా నేను నీదు పక్కలో కదలక మెదలక పడుకొని యుంటిని
అర్థరాత్రి వేళ నేనెపుడు వెళ్ళివస్తినో చెప్పవే తల్లి! చెప్పవే!

314089013

దేవరకు పెట్టవలెనని దేవునకు చెప్తూవుంటె

దేవుడేమో కాల్చిపోతె తెలియక నామద వేసిరి.

దేవుడే కాల్చి పోయాడని అనగా తాను దేవుడనని ప్రతి విషయమునందు స్పష్టముగా చక్కగా వెలిబుచ్చుతూ వచ్చాడు. మన విద్యార్థి చెప్పాడు యశోదకు నోటి లోపల అన్ని లోకములు చూపించాడని. మన్ను తిని వచ్చాడని బలరాముడు చెప్పినప్పుడు నోరు తెరచమని చెప్పింది. 'అమ్మా! మన్నుతినంగ నే శిశువునో ఆకొంటినా వెఱ్ఱినా! అమ్మా నేను మన్ను తిన్నానని అంటున్నారు. నేను చిన్న పిల్లవాడినా. నేను ఆకొంటె వాడినా. కాదు. పిచ్చి వాడినా? కాదు. నేను మన్ను ఎందుకు తింటాను. నోటిలో మన్ను వుందో లేదో నీవే చూచుకో మన్నాడు. చూచే టప్పటికి అన్ని లోకములు కనుపిస్తున్నాయి. యశోద నమ్మలేక పోయింది. తనకే అన్ని అనుమానములు. నాకేమైనా స్వప్నమా? వైష్ణవ మాయయా? యశోదాదేవిని కాదా తనకు తనకే అను భావము వచ్చింది. Secrets of greatness is faith in yourself and faith in God. మొట్టమొదట మీలో నమ్మకం కావాలి. మీలో నమ్మకము వుండటమే దైవముపైన నమ్మకము. మిమ్ములను మీరు నమ్మలేని వారు దైవమును నమ్మలేరు. కనుక తనపైన తనకు నమ్మకం లేక పోవటం చేత యశోద కృష్ణుని నమ్మలేక పోయింది. దీనికి కారణం ఏమిటి? లోక సంబంధమైన వాత్సల్యమే దీనికి కారణం. నేను తల్లి అతను కొడుకు అనే ఈ శారీరక సంబంధమైన సంబంధమును పోల్చుకుంటూ వచ్చింది.

కృష్ణుని చరిత్ర చాలా విచిత్రమైనది. కనుకనే వ్యాసులవారు చెప్పారు.

చిత్రంబులు త్రైలోక్య ప
విత్రంబులు భవలతాల విత్రంబులు స
న్మిత్రంబులు ముని జనవన
చైత్రంబులు విష్ణుదేవు చారిత్రంబుల్.

ఈ విష్ణుదేవు చరిత్ర ఎంత విచిత్రమైనది. అన్నీ కూడా విచిత్రములే. తన ఆటలు, పాటలు సర్వము కూడను విచిత్రమైనవే. అవతారములే విచిత్రములు. దానిని తెలుసుకోలేక పోవటం మరింత విచిత్రము. దానిని అనుభవించలేక పోటం ఇంకా విచిత్రము. సన్నిధియందే వుంటూండి దుఃఖము ననుభవించటము మరింత విచిత్రము. మోకాళ్ల నీటి లోపల నిల్చుకొని దాహము దాహమని ప్రాణము విడి బాధట ఎవరో. అదే విధముగానే అవతారముల దగ్గరనే వుంటూండి అవతారములతోనే సంచరిస్తూ, అవతారములతోనే తిరుగుతూ ఆడుతూ పాడుతూ అవతార తత్వమును అర్థము చేసుకోలేక పోవటం అదే ఒక విచిత్రము. అర్థము చేసుకున్నప్పుడు ఆనందము మనకు లభ్యమవుతుంది. మానవత్వమనేది చాలా పవిత్రమైన జీవితము. నిజంగా భగవద్విశ్వాసములో వుండినప్పుడు జీవితమంతయూ కూడను క్షేత్ర యాత్రగా వుంటుంది.

౧౯౯౦ ఆగష్టు ౧౪వ తేదీ మంగళవారం ప్రాంతినిలయ మందిరంలో భగవాన్ బాబావారిచ్చిన దివ్యోపన్యాసం